క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గుడ్లూరు: మండలంలోని పరకొండపాడు సచివాలయం పరిధిలోని కొండారెడ్డిపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రసేన్ ఆదివారం తెలిపారు. ఉదయం 7గంటలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఎంపీడీఓ తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనాలని ఆయన కోరారు.

కరెంట్ బిల్లుకు ఆధార్ అనుసంధానం

వలేటివారిపాలెం: కరెంట్ బిల్లుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని వలేటివారిపాలెం అసిస్టెంట్ ఇంజినీర్ టి మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల్లోని అసిస్టెంట్ గ్రేడ్ 2, జూనియర్ లైన్‌మన్ అలాగే సబ్ స్టేషన్ అపరేటర్ ద్వారా ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. కుటుంబంలో ఎవరి మీద కరెంట్ బిల్లు ఉందో వారి ఒరిజనల్ ఆధార్ కార్డు, జెరాక్స్ మీద సంతకంతో సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. కరెంట్ సర్వీస్ తీసుకున్న యజమాని చనిపోతే డెత్ సర్టిఫికెట్ తీసుకొని ఇంట్లో ఎవరు ఉంటున్నారో వారు ఆధార్ కార్డు లింక్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఉలవపాడు: భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో వచ్చే నెల 2, 3 తేదీల్లో మంగళగిరి వద్ద జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో 500 కంపెనీలు పాల్గొని 50 వేల ఉద్యోగావకాశాలు కల్పిస్తాన్నారు. రెండు జిల్లాల పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గుడ్లూరు: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడుపుకోవాలని గుడ్లూరు సర్కిల్ సీఐ సుబ్బారావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. డ్రైవర్‌కు రెండు వైపులా ప్రయాణికులను కూర్చోపెట్టరాదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఆటోలకు సంబంధించిన అన్ని రకాల అనుమతి పత్రాలు ఉండాలన్నారు. పరిమిత వేగంతో ఆటోలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. సీఐ వెంట ఎస్సై ప్రసాదరెడ్డి ఉన్నారు.

ఎస్సైగా మాధవరావు బాధ్యతల స్వీకరణ


మాధవరావు

పీసీపల్లి: ఎస్సైగా కె.మాధవరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పీసీపల్లెలో పనిచేస్తున్న ఎస్సై నాగేశ్వరరావు ఒంగోలు వీఆర్‌కు బదిలీకాగా బేస్తవారిపేట ఎస్సైగా పనిచేస్తున్న మాధవరావు పీసీపల్లెకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణకు అధికప్రాధాన్యం ఇస్తామని, శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఆలయానికి వాటర్‌ఫ్రిజ్ అందజేత


ఆలయానికి వాటర్ ఫ్రిజ్ అందజేస్తున్న దాత వెంకటేష్

పామూరు: స్థానిక మదన వేణుగోపాలస్వామి ఆలయానికి దాతలు వాటర్‌ఫ్రిజ్‌ను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ రూ.16 వేలతో వాటర్‌ఫ్రిజ్‌ను సమకూర్చి ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఆలయ అర్చకులు సత్యబాబుస్వామి, నాయకులు నీరుకట్టు నాయబ్‌రసూల్, గాడి మాలకొండయ్య, పుప్పాల రామ్మూర్తి, జైచంద్ర, వల్లం విజయ్ పాల్గొన్నారు.

11 మందిపై కేసు నమోదు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని పెద గోగులపల్లి గ్రామానికి చెందిన 11 మంది వ్యక్తులు ప్రభుత్వభూమి సర్వేనంబర్ 106లోకి అక్రమంగా ప్రవేశించి దున్నారని ఆదివారం తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వ భూమిని దున్నిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.అనీల్‌కుమార్ తెలిపారు.

లాభాల పంట

- రెండు వేలం కేంద్రాల్లోనూ ముగిసిన పొగాకు వేలం
- 2022-23 సీజన్‌లో 24.57మిలియన్ కేజీల పొగాకు అమ్మకం
- ఎస్ఎల్ఎస్ పరిధిలోని అత్యధిక సరాసరి ధరలు కందుకూరులోనే నమోదు
- ఈ ఏడాది పొగాకు సాగు పెరుగుతుందని అధికారుల అంచనాలు


పొగాకు బేళ్లు

కందుకూరు: ఈ ఏడాది పొగాకు రైతుల పంట పండింది. రికార్డు స్థాయి ధరలతో సీజన్‌ను సంతోషంగా ముగించారు. రెండేళ్ల నుంచి వస్తున్న లాభాలతో ఈ ఏడాది పొగాకు సాగుకు అధిక శాతం మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. రైతుల పోటీతో పొలాలు, బ్యారన్ల కౌలు ధరలు ఊహించని స్థాయిలో పెరుగుతున్నాయి. 2022-23 పంట సీజన్‌కు కందుకూరులోని రెండు వేలం కేంద్రాల్లో 24.57 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరగ్గా, ఎస్ఎల్ఎస్ పరిధిలోని వేలం కేంద్రాలన్నింటి కంటే కందుకూరులోనే అత్యధిక సరాసరి ధరలు నమోదయ్యాయి.

భారీగా పెరిగిన దిగుబడి

2022-23 ఏడాది పొగాకు రైతులకు బాగా కలిసొచ్చింది. రైతులు ఊహించిన దానికంటే దిగుబడులు అధికంగా వచ్చినా రేట్లు కూడా అదే స్థాయి వచ్చాయి. కందుకూరు-1, కందుకూరు-2 వేలం కేంద్రాల పరిధిలో ఈ ఏడాది 24.57 మిలియన్ కేజీల ఉత్పత్తులను విక్రయించారు. ఎస్ఎల్ఎస్ పరిధిలోని ఆరు వేలం కేంద్రాల పరిధిలోని ఇదే అత్యధికం. వీటిలో కందుకూరు-1 వేలం కేంద్రంలో 13.1మిలియన్ కేజీలు, కందుకూరు-2లో 11.47మిలియన్ కేజీలు ఉత్పత్తులను అమ్మారు. ఇవి కాక స్క్రాప్ (పొగాకు ముక్క) కింద ఒక్కో రైతు మరో 5 క్వింటాళ్ల వరకు విక్రయించారు. గతంలో స్క్రాప్‌ను బోర్డులో విక్రయించుకునే వెసులుబాటు ఉండేది కాదు. కానీ బోర్డు ఈ ఏడాది పొగాకు ముక్కను కూడా వేలం కేంద్రాల్లోను విక్రయించుకునే అనుమతి ఇవ్వడంతో ఇది కూడా రైతులకు వరంగా మారింది.

అత్యధిక సరాసరి ధరలు ఇక్కడే నమోదు

ఈ ఏడాది పొగాకు వేలంలో రికార్డులు ధరలు పలికాయి. అయితే ఒంగోలు రీజియన్ పరిధిలో మిగిలిన వేలం కేంద్రాలతో పోల్చుకుంటే కందుకూరు వేలం కేంద్రాల్లోనే అత్యధిక ధరలు నమోదయ్యాయి. కందుకూరు-1 వేలం కేంద్రంలో బ్రైట్ గ్రేడ్ పొగాకు కేజీ అత్యధికంగా రూ.288 వరకు పలికింది. అదే లోగ్రేడ్ పొగాకు కూడా ఒక దశలో రూ.190 వరకు రావడం గమనార్హం. ఆ తరువాత అది రూ 160-170ల మధ్య స్థిరంగా ఉండిపోయింది. అయితే గ్రేడ్‌లతో సంబంధం లేకుండా అన్ని రకాల పొగాకు దాదాపు ఒకే రకమైన ధరలు రావడంతో సరాసరి ధరలు రూ.200 దాటాయి. కందుకూరు-1లో కేజీ పొగాకు సరాసరి ధర రూ.222.53లు వస్తే, కందకూరు-2లో 218.05లు వచ్చాయి. ఎస్ఎల్ఎస్ పరిధిలోని మిగిలిన వేలం కేంద్రాలతో పోల్చితే దాదాపు రూ.10 అధికంగా సరాసరి ధర ఇక్కడ వచ్చింది. అంటే క్వింటా పొగాకును సరాసరిన రూ. 22,200 వరకు ఈ ఏడాది రైతులు విక్రయించారు.

భారీగా పెరిగిన బ్యారన్ కౌలు

ఈ ఏడాది వచ్చిన అధిక లాభాలతో పొగాకు రైతులు మరోసారి పొగాకు సాగుపై అధికంగా మొగ్గు చూపుతున్నారు. దీంతో కందుకూరు ప్రాంతంలో పొలాలు, బ్యారన్ల కోసం రైతుల మధ్య పోటీ పెరగడంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గతేడాది రూ.80 వేలు ఉన్న బ్యారన్ కౌలును ఈ ఏడాది రూ రూ.1.60లక్షల వరకు చెల్లించి తీసుకుంటున్నారు. పొలం కౌలు అయితే రెండింతలు అయింది. గతేడాది రూ.10వేల నుంచి రూ.15వేల మధ్య ఉన్న పొలం కౌలు ఈ ఏడాది రూ.25వేలకు పెంచేశారు. అయితే బోర్డు అధికారులు మాత్రం రైతులు పోటీ పడి కౌలు ధరలు పెంచుకోవద్దని, ప్రతికూల పరిస్థితులు ఎదురైతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

మంచి లాభాలు వచ్చాయి



వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెం గ్రామానికి చెందిన పొగాకు రైతు అనుమోలు సుబ్బారావు. నష్టమొచ్చినా లాభమొచ్చినా పొగాకు పంటనే సాగు చేస్తుంటారు. ఈ ఏడాది 25 ఎకరాల్లో పంట సాగు చేశాడు. సరాసరిన ఎకరానికి 8క్వింటాళ్ల చొప్పున 200 క్వింటాళ్ల దిగుబడి సాధించాడు. దీనిలో 135క్వింటాళ్లు గ్రేడ్-1 పొగాకును క్వింటా రూ 24వేల చొప్పున అమ్మకం చేశాడు. 20క్వింటాళ్ల లోగ్రేడ్ పొగాకును రూ 20వేల చొప్పున మొత్తం రూ 44.40 లక్షల విలువ చేసే ఉత్పత్తులను అమ్మాడు. సాగు ఖర్చుల కింద రూ. 30లక్షలు పోను ఈ ఏడాది రూ 15.60లక్షల వరకు ఆదాయం సాధించాడు.

– అనుమోలు సుబ్బారావు, పోలినేనిపాలెం

మార్కెట్ బాగుంది



ఎకరానికి రూ.లక్ష ఖర్చు అయింది. 15 ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశాడు. ఎకరానికి 7 క్వింటాళ్ల లెక్కన 105క్వింటాళ్ల దిగుబడి సాధించాడు. 75 క్వింటాళ్లను సరాసరిన రూ 20వేల లెక్కన అమ్మగా, లోగ్రేడ్ పొగాకు 25 క్వింటాళ్లు రూ 15వేల లెక్కన అమ్మాడు. సాగు ఖర్చుల కింద రూ 15 లక్షలు పోను ఈ ఏడాది రూ. 5 లక్షలకు పైగా ఆదాయం సాదించగలిగాడు.

– చెన్నుబోయిన శ్రీనివాసరావు, అమ్మపాలెం


అర్బన్ కాలనీలో అక్రమ నిర్మాణాలను తొలగించేదుకు చర్యలు తీసుకుంటున్న ఆర్డీఓ టీ అజయ్ కుమార్

ఆక్రమ కట్టడాలపై ఉక్కుపాదం

- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు.
- ఆర్డీఓ అజయ్‌కుమార్ హెచ్చరిక


తొలగిస్తున్న అక్రమ కట్టడాలు

కనిగిరి రూరల్: పట్టణంలోని అర్బన్ కాలనీలో శివారులో రాత్రికి రాత్రే కొందరు చేపట్టిన అక్రమ కట్టడాలను, నిర్మాణాలను రెవెన్యూ అధికారులు ఆదివారం తొలగించారు. ఆర్డీఓ తోట అజయ్‌కుమార్ పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ సిబ్బంది బృందంగా ఏర్పడి సర్వే నంబర్ 42లో నిర్మించిన ప్రహరీ అక్రమణలకు, బేస్ మట్టం కట్టడాలను అధికారులు యంత్రాలతో నేల మట్టం చేశారు. అనంతరం ఆర్డీఓ తోట అజయ్‌కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ఎవరూ ఆక్రమించినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రభుత్వ ఇచ్చిన లే అవుట్లలోని కమ్యూనిటీ పర్‌పస్‌కు వదిలిన స్థలాలను, రోడ్లను ఆక్రమిస్తే నిర్దాక్షిణ్యంగా తొలగిస్తామన్నారు.

సర్వే నంబర్ 42లో అక్రమణలు తొలగింపు..

పట్టణంలోని అర్బన్ కాలనీలో చాకిరాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 42లో కమ్యూనిటీ పరపస్(గుడి, బడి, వాటర్ ట్యాంక్, పార్క్, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర ప్రభుత్వ భవనాల కట్టడాలకు కేటాయించిన) సుమారు 88 ప్లాట్లలో జరిగిన కట్టడాలను పూర్తిగా తొలగించినట్లు ఆర్డీఓ తోటా అజయ్ కుమార్ వెల్లడించారు. ఆ 88 ప్లాట్లలో 44 ప్లాట్లలో బేస్ మట్టాలున్నాయని, 19 ప్లాట్లల్లో ప్రహరీ కట్టడాలు ఉన్నాయని తెలిపారు. రెండు ప్లాట్లలో పూర్తిగా స్లాబ్ లెవల్‌కు ఎస్కే గౌసియా కట్టడాలు నిర్మించారని, ఒక ప్లాట్‌లో ఎస్ నహేమియా పూర్తిగా ఇంటి నిర్మాణం చేసుకుని ఉన్నట్లు చెప్పారు. అయితే ఈ మూడు నిర్మాణాలకు సంబంధించి సంజాయిషి నోటీసు జారీ చేశామని, 15 రోజుల్లో సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ఆ ముగ్గురి పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. వాస్తవంగా వారు అర్హులైతే వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ స్పష్టం చేశారు. అయితే అదే ప్రాంతంలో మరో 5 వరకు ప్లాట్లకు పట్టాలు ఉన్నట్లు తమ దృష్టికి తెచ్చారని, వారు సోమవారం ఆఫీసుకు వచ్చి అర్జీలు ఇస్తే వాటి వాస్తవికతను పరిశీలిస్తామన్నారు. తక్కువ ధరకు వస్తున్నాయని దొంగ, నకిలీ పట్టాలను కొని మోసపోవద్దని ఆర్డీఓ హెచ్చరించారు. ప్రభుత్వ పట్టాలను కొనడం, అమ్మడం నేరమన్నారు. కార్యక్రమంలో కనిగిరి, హెచ్ఎం పాడు ఎస్సైలు దాసరి ప్రసాద్, శివ నాగరాజు, గౌస్ బాషా, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి


ఆలయ ప్రాంగణంలో భక్తులు

జరుగుమల్లి: మండల పరిధిలోని కామేపల్లి పోలేరమ్మ ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే పోలేరమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అభిషేకాల అనంతరం పోలేరమ్మను అర్చకులు శ్రీనివాస శర్మ ప్రతేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కుంకుమ పూజ, గోత్ర నామార్చనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివ శంకర్, దేవస్థానం చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయానికి అనుమోలు వెంకటస్వామి, సుశీల దంపతులు రూ.51,116, వడ్ల మాధవరెడ్డి, సుధీరాలు రూ.10,116, దొంతి నరేంద్ర, శివపార్వతి రూ. 25,116, తుమ్మపూడి వెంకటసురేష్‌బాబు, సురేఖలు రూ. 25,116, ఆముదాలపల్లి మాల్యాద్రి, సునీతలు రూ.10,116, గడ్డు ప్రభాకర్, వెంకట సునీత రూ.10,116, గణేశం జశ్వంత్, నవీనలు రూ. 25,116, ఇరగల నారాయణరెడ్డి, పెంచలమ్మలు రూ.10,116, రాధాకృష్ణమూర్తి, వెంకటసుబ్బమ్మ రూ.5,116, యశ్వంత్ రూ.1120, నేరెల్ల చరణ్‌బాబు, వెంకటలక్ష్మీ రూ.6250, మోదడుగు వెంకట రమణయ్య, అరుణకుమారిలు రూ.6250 విరాళం అందజేశారు. అదే విధంగా అనుమోలు వెంకటస్వామి, సుశీల దంపతులు, దొంతి నరేంద్ర, శివపార్వతి దంపతులు, బత్తుల గోవర్ధన్‌రెడ్డి, మణిలు దంపతులు, గణేశం జశ్వంత్‌రెడ్డి, నవీనాలు, జిల్లెలమూడి కోటేశ్వరరావు, వెంకట సురేఖలు, మద్రిపూడి మల్లికార్జున, రజనిలు, ఘట్టమనేని హరిబాబు, భారతిలు, వెంకట బాలాజీ, వెంకట శివకుమారిలు, రావూరి జయరావు, ధనలక్ష్మీ దంపతులు ఒక్కొక్కరు రూ. 6250ల చొప్పున గ్రామ బంగారం కింద అందజేశారు.

నాగార్వమ్మ తల్లికి వరికూటి పూజలు


నాగార్వమ్మ తల్లి కొలుపుల్లో పాల్గొన్న వరికూటి

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ గ్రామంలో ఆదివారం నిర్వహించిన నాగార్వమ్మ తల్లి కొలుపుల్లో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గెలుపొందాలని కోరుకున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, గుండపురెడ్డి శ్రీహరిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, మళ్లవరపు రాఘవరెడ్డి, ముళ్లపూడి సత్యన్నారాయణ, నల్లూరి సురేంద్ర, ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీవీ రమణ దంపతులకు సన్మానం


బీవీ రమణ, సులోచన దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు: సమాజ సేవలో నిరంతరం తన వంత పాత్రను పోషిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించిన బీవీ రమణ ఆదర్శనీయులని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, ప్రాణ, యోగ, ధ్యాన శిక్షణ గురువు, అమ్మ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు బీవీ రమణ, సులోచన దంపతుల షష్టిపూర్తి మహోత్సవం ఆదివారం స్థానిక జనార్దనస్వామి కళ్యాణ మండపంలో జరిగింది.

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఎంఈఓ-2 సుబ్బారెడ్డి, వివి పాలెం జడ్పీటీసీ ఇంటూరి భారతి, జనార్దనస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

కనిగిరి రూరల్: నాయి బ్రాహ్మణ విద్యార్థులకు అందచేయనున్న ఉపకార వేతనాలు, ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని కనిగిరి నాయి బ్రహ్మణ ఉద్యోగ సంఘ నాయకుడు పి.పూర్ణ చంద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నాయి బ్రహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో విద్యా రంగంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు, ప్రశంసపత్రాలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 8466959360, 9502500246 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయానికి తప్పనిసరిగా రావాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్

టంగుటూరు: విద్యార్థులు ప్రతి ఆదివారం తప్పనిసరిగా గ్రంథాలయానికి రావాలని లైబ్రేరియన్ వర్ధనరాజు సూచించారు. స్థానిక శబూఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని లైబ్రేరియన్ పేర్కొన్నారు. పిల్లలను గ్రంథాలయానికి పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

చాకిచర్లలో పూర్వ విద్యార్థుల కలయిక


చాకిచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల కలయిక

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2008-09లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించి వారికి మెమెంటోలు అందచేశారు. ఉపాధ్యాయలు నాగరాజు, శ్రీనివాసులు, మురళి, ధనలక్ష్మి, సుబ్బారెడ్డి మాట్లాడారు. నిర్వాహకులు ప్రవీణ్ తో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

30 నుంచి సీపీఎం సమరభేరి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు: ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. స్థానిక సుందరయ్యభవన్‌లో ఆదివారం సమరబేరి ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నిరుద్యోగ సమస్యతో పాటు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అధిక ధరలు అరికట్టాలని ఈనెల 30వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేస్తామన్నారు. ఒకటి, రెండు తేదీల్లో సచివాలయాల్లో వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 4వ తేదీ మండల కేంద్రాల్లో ధర్నాలు చేస్తామని చెప్పారు. సీపీఎం నాయకులు ఎస్ఏ గౌస్, అజయ్‌కుమార్, డి. రామమ్మూర్తి, ఎస్కే మున్వర్‌సుల్తానా, పద్మ, ఎస్కే మల్లిక తదితరులు పాల్గొన్నారు.

కాపలాదారుని పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు రూరల్: కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ఆవరణంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కాపలాదారుని పోస్టు కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జెహెచ్.హర్షవర్ధన్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి పాసై, షెడ్యూల్ కులానికి చెందిన వారు అర్హులని తలిపారు. 30-09-2023 నాటికి 47 ఏళ్ల లోపు వారై ఉండాలన్నారు. వచ్చే నెల 3వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులు కళాశాలలో అందజేయాలన్నారు. 4వ తేదీ 10.30 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే సహించను


పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కారంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 8వ వార్డులో ఆదివారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా చైర్మన్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పారిశుధ్య సమస్యపై ప్రజా ప్రతినిధులు, పారిశుధ్య జాగ్రత్తలు పాటించినప్పుడే మంచి వాతావరణం, మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. కౌన్సిలర్ ఎస్కే షఫీ జాస్మిన్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ సెక్రటరీ లోకేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటి గంగా భవానికి ప్రత్యేక పూజలు



తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి ఆరు చీరెలు సమర్పించారు. ఆలయానికి 18965 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆర్ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఈఓ ఏబీ భాస్కరరెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు సౌకర్యాలను కల్పించారు.